క్లుప్తంగా

108లో మహిళ ప్రసవం



108లో ప్రసవించిన మహిళ

నిజాంపేట(మెదక్): ఓ మహిళ శనివారం 108లో ప్రసవించింది. నిజాంపేట మండల శివారులోని ఓ ఫౌల్ట్రీఫామ్‌లో బిహార్‌కు చెందిన మహిళ పురిటి నొప్పులతో బాధపడుతూ ఉంటే.. 108 సిబ్బందికి సమాచారం అందించారు. ఆమెను ఆస్పత్రికి తరలిస్తున్న క్రమంలో మార్గమధ్యలో ప్రసవించింది. ఆమెకు ఆడ బిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డను ధర్మారం ప్రభుత్వాసుపత్రికి తరలించగా.. పరిశీలించిన వైద్యులు.. వారిద్దరు క్షేమంగా ఉన్నారని తెలిపారు. కార్యక్రమంలో ఈఎంటీ స్వామి, పైలట్ సురేష్, ఆశ లక్ష్మి, గౌరీ తదితరులు ఉన్నారు.

200 మందికి ఉచిత వైద్య పరీక్షలు



మండలంలోని కామారంలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులు

చిన్నశంకరంపేట(మెదక్): మండలంలోని కామారం గ్రామంలో శనివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో మల్లారెడ్డి ఆస్పత్రి వైద్యులు వైద్య పరీక్షలు, ఉచిత మందుల పంపిణీ చేశారు. మల్లారెడ్డి ఆస్పత్రి, సానీక్ష ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో 200 మందికి వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులను ఉచితంగా అందించారు. శస్త్ర చికిత్సలు, సీటీ స్కానింగ్ అవసరమైన వారిని మల్లారెడ్డి ఆస్పత్రికి తరలించి ఉచిత వైద్యం అందించనున్నట్లు తెలిపారు.

దైవ చింతనతో మానసిక సమస్యలు దూరం



పూజలు నిర్వహిస్తున్న గురువు ప్రేమ్‌సింగ్

చిన్నశంకరంపేట(మెదక్): దైవచింతనతో మానసిక సమస్యలకు దూరం అవుతాయని బంజారాల గురువు ప్రేమ్‌సింగ్ మహారాజ్ సూచించారు. శనివారం కామారం తండాలో భోగ్‌బండార్ నిర్వహించిన మహారాజ్ మాట్లాడుతూ..సేవాలాల్ మహారాజ్, భవానీమాతల నామస్మరణతో మేలు జరుగుతుందని చెప్పారు. ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మిక కార్యక్రమాలలో పాల్గొనాలని చెప్పారు. కార్యక్రమంలో ఆలయ పూజారి శంకర్‌నాయక్, మాజీ ఉప సర్పంచ్ బీమ్లానాయక్, స్వామి, వెంకటేశ్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

ఫర్టిలైజర్ దుకాణాల తనిఖీ



బొద్మట్‌పల్లిలో విత్తన పాకెట్లను పరిశీలిస్తున్న ఏఓ

టేక్మాల్(మెదక్): టేక్మాల్ మండలం బొద్మట్‌పల్లిలోని ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం వ్యవసాయాధికారి రాంప్రసాద్, పోలీసులతో కలిసి తనిఖీ చేశారు. దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏఓ మాట్లాడుతూ.. అనుమతి లేని విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత రసాయన మందుల అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను అమ్మాలని, రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని సూచించారు. విత్తనాలు అమ్మకం విషయంలో తగు జాగ్రత్తలు పాటించాలని సూచించారు. ఇందులో పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

తహసీల్దార్‌గా సలీమ్



చిన్నకోడూరు(సిద్దిపేట): స్థానిక తహసీల్దార్‌గా ఎండీ సలీమ్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ విధులు నిర్వహించిన తహసీల్దార్ హరి కిరణ్ సిద్దిపేట అర్బన్‌కు బదిలీ అయ్యారు.

మూగజీవాల మృత్యుఘోష

ప్రమాదభరితంగా విద్యుత్ వైర్లు
- విద్యుదాఘాతంతో పశువుల మృతి
- ఆర్థికంగా నష్టపోతున్న రైతులు
- పట్టించుకోని విద్యుత్ అధికారులు



లింగోజిగూడ వద్ద కర్రకు ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్ల వల్ల మృతిచెందిన గేదె (ఫైల్)

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలో వేలాడుతున్న వైర్లు మూగజీవాల పాలిట శాపంగా మారాయి. పొలాల దగ్గర విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లకు అర్తింగ్ వైర్ల మూలంగా మూగజీవాలు విద్యుదాఘాతానికి గురై మృత్యువాత పడుతున్నాయి. ఇలాంటి ఘటనలు మండలంలో నిత్యం ఏదో ఒకచోట చోటుచేసుకుంటున్నాయి. ముఖ్యంగా వ్యవసాయ బోరు బావులకు సంబంధించి విద్యుత్ స్తంభాల ఏర్పాటు చేయకపోవడం.. కర్రలు పాతి వైర్లు ఏర్పాటు చేయడం వల్ల ఈ ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని చెబుతున్నారు. పలు ట్రాన్స్‌ఫార్మర్లు రోడ్ల పక్కన, జనసంచారం ప్రదేశాల్లో ఉండటం వల్ల కూడా మూగజీవాలు బలి అవుతున్నాయి. అధిక ప్రమాదాలు జరుగుతున్నప్పటికీ సంబంధిత విద్యుత్ శాఖ ఎలాంటి రక్షణ చర్యలు చేపట్టడం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. పలుమార్లు స్థానిక సిబ్బందికి చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వారం రోజుల వ్యవధిలో శివ్వంపేట, గూడూర్, తిమ్మాపూర్, లింగోజిగూడ, ఎదుల్లాపూర్ తదితర ప్రాంతాల్లో విద్యుదాఘాతంతో అనేక గేదెలు మృతి చెందాయి. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి ప్రమాదభరితంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ కంచె ఏర్పాటుతో పాటు వైర్లను సరిచేయాల్సిన అవసరం ఉందని ప్రజలు కోరుతున్నారు.

> **ఉన్నతాధికారులకు నివేదిస్తా**
> ప్రమాదభరితంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు, విద్యుత్ వైర్లను సరిచేసేందుకు ఉన్నతాధికారులకు నివేదిస్తా. పలు ట్రాన్స్‌ఫార్మర్ల ఎత్తు పెంచడంతో పాటు కిందికి వేలాడుతున్న వైర్లను సరిచేసేందుకు చర్యలు తీసుకుంటాం.
> – సాయిరాం, ఇన్‌చార్జి ఏఈ

ఘనంగా ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ



పూజలు చేస్తున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని ముట్రాజ్‌పల్లిలో శ్రీ ఆంజనేయస్వామి ఆలయం విగ్రహ ప్రతిష్ఠ ధ్వజస్తంభ ప్రతిష్ఠ ఘనంగా నిర్వహించారు. శనివారం రంగంపేట పీఠాధిపతి మాదవానంద సరస్వతీస్వామి ఆధ్వర్యంలో వేదపండితులు రామకృష్ణశర్మ, మనోజ్‌శర్మ, నటరాజ్‌శర్మ పూజలు కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హోమం చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం చేశారు. కాగా, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమంలో ఎమ్మెల్యే సునీతారెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో మండల ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు ప్రవీణ్‌కుమార్, మాజీ సర్పంచ్ సంజీవ్, మాజీ ఉపసర్పంచ్ వెంకటేశం, మాజీ ఎంపీపీలు రాజు, హరికృష్ణ, మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు రామాగౌడ్, పాల్గొన్నారు.

అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలు ఎంచుకోవాలి

తునికి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి



అవగాహన కల్పిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

చిన్నశంకరంపేట(మెదక్): రైతులు అధిక దిగుబడిని ఇచ్చే వరి విత్తనాలు ఎంచుకోవాలని వ్యవసాయ తునికి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ భార్గవి కోరారు. శనివారం నార్సింగి మండలం నర్సంపల్లి, బీమ్‌రావుపల్లి గ్రామాలలో వికసిత కృషి సంకల్ప్ అభియన్ ఆధ్వర్యంలో వానాకాలం పంటల సాగుపై అవగాహన కల్పించారు. తునికి శాస్త్రవేత్త డాక్టర్ భార్గవి, రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీ శాస్త్రవేత్త బసవరాజ్, డాక్టర్ ప్రసూష ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. అధిక దిగుబడిని ఇచ్చి సన్నరకం విత్తనాలు కేఎస్ఎం 1638, ఆర్ఎన్ఆర్ 15048, బీపీటీ 5904, దొడ్డుర కాలైన జేజీఎల్ 24423, ఆర్ఎన్ఆర్ 28361,కెఎన్ఎం 118 రకాల గురించి వివరించారు. రసాయన ఎరువులను తగ్గించి జీవన ఎరువులను వినియోగించాలని కోరారు. కార్యక్రమంలో నార్సింగి ఏఓ హరి ప్రసాద్, ఏఈఓ విజృంభణ పాల్గొన్నారు.

రేయిలింగ్ విరిగినా పట్టదా..?



రేయిలింగ్ విరిగి రోడ్డుపైకి వచ్చిన ఇనుప చువ్వలు

జాతీయ రహదారి మధ్యలో డివైడర్‌పై ఏర్పాటు చేసిన రేయిలింగ్ విరగడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. నర్సాపూర్ మున్సిపాలిటీ పట్టణ పరిధిలోని జాతీయ రహదారిపై రోడ్డు మధ్యలో నిర్మించిన డివైడర్‌తో రోడ్డుకు ఇరువైపుల ఇనుప రేయిలింగ్ ఏర్పాటు చేశారు. పలు సందర్భాల్లో వాహనాలు డివైడర్, రేయిలింగ్‌లకు ఢీకొట్టడంతో అవి దెబ్బతిన్నాయి. నెలలు గడుస్తున్నా వాటిని మరమ్మతుకు నోచుకోవడం లేదు. ఫారెస్ట్ ఆఫీసు ఎదురుగా, బస్టాండు సమీపంలో, డీసీసీబీ బ్యాంకు ఎదురుగా, ఇలా.. మరికొన్ని చోట్ల రేయిలింగ్ విరిగి ఇనుప చువ్వలు బయటకు వచ్చి ప్రమాదభరితంగా మారాయి. అలాగే.. రేయిలింగ్ పట్టీలను కొందరు వ్యక్తులు చోరీ చేస్తున్నారని తెలిసింది. సంబంధిత అధికారులు తగు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

– నర్సాపూర్



డీసీసీబీ బ్యాంకు ఎదురుగా..



రేయిలింగ్ విరిగి రోడ్డుపై పడిన దృశ్యం

సంక్షిప్త వార్తలు

◆ **గోవధ జరగకుండా రక్షించాలి**

కౌడిపల్లి(నర్సాపూర్): గోవధ జరగకుండా చర్యలు చేపట్టాలని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు రాజేందర్ కోరారు. శనివారం ఆ పార్టీ నాయకులతో కలిసి కౌడిపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. హిందువులు గోవులను పూజిస్తారని చెప్పారు. బక్రీద్ పండుగకు గోవులను అక్రమంగా తరలించడం, గోవధ చేయడం జరగకుండా చూడాలని కోరారు. కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి క్రిష్ణ, పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

◆ **కాలభైరవ స్వామికి ప్రత్యేక పూజలు**

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామ శివారులోగల శ్రీకాలభైరవ స్వామికి గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా స్వామికి భస్మాభిషేకం, భస్మాలంకరణ ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

◆ **జూన్ 3 నుంచి రెవెన్యూ సదస్సులు**

అల్లాదుర్గం(మెదక్): జూన్ 3 నుంచి 20వ తేదీ వరకు భూభారతిపై రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ మల్లయ్య తెలిపారు. రైతుల సమస్యలపై దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. భూముల సమస్యలను పరిష్కరించేందుకు ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

◆ **ఘనంగా గ్రామదేవతల విగ్రహ ప్రతిష్ఠ**

వెల్దుర్తి(తూప్రాన్): మండలంలోని భస్వాపూర్‌లో గ్రామ దేవతల విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమాలు ఘనంగా కొనసాగుతున్నాయి. వేడుకల్లో శనివారం ఎమ్మెల్యే సునితారెడ్డి, పీసీసీ ప్రధాన కార్యదర్శి రాజిరెడ్డిలు వేర్వేరుగా పాల్గొని దేవతా మూర్తుల విగ్రహాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అవసరం మేరకే రసాయనాలు వాడాలి

మనోహరాబాద్(తూప్రాన్): రైతులు తాము సాగు చేసే భూమిలో అవసరం మేరకే రసాయనాలను వాడాలని వ్యవసాయ విశ్వవిద్యాలయం శాస్త్రవేత్తలు విజయలక్ష్మి అన్నారు. శనివారం మనోహరాబాద్ మండలం పాలాట గ్రామంలో క్షేత్రస్థాయిలో రైతులకు వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సాగులో మెలకువలు, వాతావరణానికి అనుగుణంగా సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వెంకటేశ్, వ్యవసాయ అధికారి స్రవంతి, ఏఈఓ నరేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

3 నుంచి గ్రామసభలు

చిన్నశంకరంపేట(మెదక్): నార్సింగి మండలంలోని రెవెన్యూ గ్రామాలలో జూన్ 3 నుంచి 12వ తేదీ వరకు భూ భారతి గ్రామసభలు నిర్వహించనున్నట్లు తహసీల్దార్ షేక్ కరీం తెలిపారు. రైతులు తమ సమస్యలపై ఈ గ్రామసభల్లో దరఖాస్తులు అందిస్తే పరిశీలించి పరిష్కరించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

బడిబాట తర్వాత సర్దుబాటు చేయాలి

పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్

నర్సాపూర్: ప్రాథమిక పాఠశాలలో తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలని, బడిబాట కార్యక్రమం అనంతరం ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి సామ్యానాయక్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జూన్ 13లోపు ఉపాధ్యాయులను సర్దుబాటు చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడంతో విద్యా వ్యవస్థను అయోమయానికి గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. బడిబాటతో పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య పెరుగుతోందని, వారి సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయులు ఉండాల్సిన అవసరం ఉందన్నారు. వేసవి సెలవులను లెక్క చేయకుండా ఉపాధ్యాయులు ఇంటింటికి తిరిగి బడి బాట కార్యక్రమం నిర్వహిస్తున్నారని, విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేస్తున్నారని, ఈ దశలో ఉపాధ్యాయులను సర్దుబాటు చేయడం ఎంత వరకు సమంజసమని సామ్యానాయక్ ప్రశ్నించారు.

నాచగిరి ఈఓగా విజయరామారావు

వర్గల్(గజ్వేల్): నాచారం గుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారిగా వి.విజయరామారావు శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఉమ్మడి నిజామాబాద్ జిల్లా సహాయ కమిషనర్‌గా పనిచేస్తున్న ఆయన పూర్తి అదనపు బాధ్యతలతో ఇక్కడ నియమితులయ్యారు. ఇక్కడ బాధ్యతలు నిర్వహించిన విశ్వనాథశర్మ శనివారం ఉద్యోగ విరమణ చేశారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పట్టణంలోని 11కేవీ హనుమాన్‌నగర్ ఫీడర్‌ల మరమ్మతుల కారణంగా ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని సిద్దిపేట అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్ సుధాకర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. హనుమాన్‌నగర్, ముర్షద్‌గఢ్, గణేశ్‌నగర్, గ్రీన్‌హౌస్ కాలనీ, ప్రభుత్వ ఆస్పత్రి ఏరియా, ఏకలవ్యనగర్, న్యూసాయినగర్, సాయిబాబా ఆలయ ప్రాంతాలలో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందన్నారు.

సిద్దిపేటఅర్బన్‌లో..

సిద్దిపేటఅర్బన్: మిట్టపల్లి ఫీడర్ మరమ్మతుల కారణంగా ఆదివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏడీఈ శ్రీనివాసులు శనివారం తెలిపారు. మందపల్లి సబ్‌స్టేషన్ పరిధిలో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఉంటుందని తెలిపారు.

మాదక ద్రవ్యాలకు దూరం ఉండండి

ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నవీన్



మాట్లాడుతున్న వైద్యుడు నవీన్‌కుమార్

నర్సాపూర్: పొగాకు, మాదక ద్రవ్యాలతో ప్రాణాలకు ప్రమాదమని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి వైద్యులు నవీన్ హితవు పలికారు. శనివారం పొగాకు నిర్మూలన దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో కోర్టు ఆవరణలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులతో ప్రాణాంతక వ్యాధులు వస్తాయని డాక్టర్ చెప్పారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని హితవు పలికారు. ఎక్సైజ్ ఎస్ఐ రాఘవేందర్‌రావు మాట్లాడుతూ నిషేధిత మాదక ద్రవ్యాలను అమ్మితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. సమావేశంలో న్యాయవాదులు స్వరూపరాణి, శ్రీనివాస్, రవినాయక్, ఐకేపీ ఏపీఎం గౌరీశంకర్, ఉపాధి హామీ ఏపీఓ అంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు

ఏఓ జావిద్



రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ జావిద్

రేగోడ్(మెదక్): కల్తీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఏఓ జావిద్ హెచ్చరించారు. మండల కేంద్రమైన రేగోడ్‌లోని పలు ఫర్టిలైజర్ దుకాణాలను శనివారం తనిఖీ చేశారు. రికార్డులు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అనుమతి లేని విత్తనాలు, ప్రభుత్వ నిషేధిత రసాయన మందుల అమ్మకాలు జరిపితే చర్యలు తప్పవని హెచ్చరించారు. రైతులకు పూర్తి వివరాలతో కూడిన రశీదు ఇవ్వాలని సూచించారు. దుకాణాల్లో విత్తన ప్యాకెట్లు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్‌లను సక్రమంగా ఉంచాలన్నారు. దుకాణం ఎదుట స్టాక్, ధరలు, విత్తనాల వివరాలను తెలిపే బోర్డులను ఏర్పాటు చేయాలని సూచించారు. గడువు ముగిసిన ఎరువులు, పురుగు మందులు విక్రయించవద్దన్నారు. అమ్మకాలు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని చెప్పారు.

యోగాతో ఆరోగ్య సమస్యలు దూరం



యోగాపై అవగాహన కల్పిస్తున్న శ్రీదేవి

చేగుంట(తూప్రాన్): ప్రాణాయామంతో ఆరోగ్య సంబంధిత సమస్యలు దూరమవుతాయని ఆయుష్ యోగా కోచ్ కరణం శ్రీదేవి అన్నారు. శనివారం చేగుంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో యోగా ఆరోగ్య కేంద్రం సిబ్బందితో ప్రాణాయామం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. యోగా, ప్రాణాయామం గురించి వివరించారు. కార్యక్రమంలో డాక్టర్‌లు అనిల్‌కుమార్, మృదుల, మృధుల, సీహెచ్‌ఓ సంపతి, సిబ్బంది రాజిరెడ్డి, నీలిమ, అనిత, నరేష్, ఫహీంపాష తదితరులు ఉన్నారు.



శిక్షణ పొందుతున్న డాక్టర్లు, ఇతర సిబ్బంది

ఆస్పత్రిలో యోగా శిక్షణ

రామాయంపేట(మెదక్): ఆయుష్ శాఖ ఆధ్వర్యంలో శనివారం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో పనిచేస్తున్న వైద్యులు, నర్సులు, ఇతర వైద్య సిబ్బందికి యోగాలో శిక్షణ ఇచ్చారు. శిక్షకులు మద్దెల భరత్ ఆధ్వర్యంలో ఆసుపత్రిలోనే వారికి శిక్షణ అందజేశారు. నిద్రలేమి, ఆగ్రహావేశాల నియంత్రణ, తదితర అంశాలపై యోగా శిక్షణ ఇచ్చారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ లింబాద్రి, ఇతర వైద్యులు, ఏఎన్ఎంలు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైభవంగా రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ



తీర్థ ప్రసాదాలు స్వీకరిస్తున్న ఎంపీ రఘునందన్‌రావు



అమ్మవారిని దర్శించుకుంటున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి, నాయకులు

నర్సాపూర్ రూరల్: మండలంలోని గొల్లపల్లిలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు వల్దాస్ మల్లేష్‌గౌడ్ ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన రేణుక ఎల్లమ్మ ఆలయంలో శనివారం మాధవానంద సరస్వతి స్వామి చేతుల మీదుగా విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించారు. ఉదయం గణపతి పూజ, మహాబలి నివేదన, పూర్ణాహుతి, రేణుక ఎల్లమ్మ జమదాగ్ని కల్యాణం నిర్వహించారు. మెదక్ ఎంపీ రఘునందన్‌రావు, నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతారెడ్డి, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్‌పర్సన్ సుహాసిని రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ అశోక్‌గౌడ్, బీజేపీ ఓబీసీ ఉపాధ్యక్షుడు రమేష్‌గౌడ్‌తో పాటు పలు పార్టీల నాయకులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.

అందరూ కలిసి మెలిసి ఉండాలి

ఆర్ఐ సాయిశ్రీకాంత్



బొద్మట్‌పల్లిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు

టేక్మాల్(మెదక్): ప్రజలంతా కలిసిమెలిసి ఉండాలని ఆర్ఐ సాయిశ్రీకాంత్ తెలిపారు. శనివారం టేక్మాల్ మండలం బొద్మట్‌పల్లి ఎస్సీ కమ్యునిటీహాలులో పౌర హక్కుల దినోత్సవాన్ని నిర్వహించారు. రెండు గ్లాసుల పద్ధతిపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అందరూ అన్నదమ్ముల వలే కలిసి ఉండాలన్నారు. ప్రతి పర్వదినాన్ని కులమతాలకు అతీతంగా జరుపుకోవాలన్నారు. కలిసి ఉంటేనే గ్రామాబివృద్ధి జరుగుతుందని, అందరికి ఆదర్శంగా ఉండాలన్నారు. ఎటువంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తీసుకురావాలని సూచించారు.

పేదల సంక్షేమానికి పెద్దపీట

మెదక్ మున్సిపాలిటీ: పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం పెద్దపీట వేస్తుందని ఎమ్మెల్యే రోహిత్‌రావు అన్నారు. శనివారం మెదక్ పట్టణంలోని మార్కెట్ కమిటీ యార్డ్‌లో పట్టణంలోని లబ్ధిదారులకు కళ్యాణలక్ష్మి చెక్కులను అందజేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ చంద్రపాల్, మాజీ కౌన్సిలర్లు, సీనియర్ కాంగ్రెస్ నాయకులు, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.



కల్యాణలక్ష్మి చెక్కులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రోహిత్‌రావు